**పత్రికాప్రకటన** **కాకినాడ, ఆగష్టు 27, 2019.**

**సెప్టెంబర్ 1 నుండి హెల్మెట్స్, సీట్ బెల్ట్ వాడకం తప్పనిసరి.**

**రోడ్డు ఆడిట్ నివేదిక ఆధారంగా ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలి.**

-- జిల్లా స్థాయి రోడ్డు భద్రత సమావేశంలో కలక్టర్ డి.మురళీధర్ రెడ్డి.

జిల్లాలో ద్విచక్ర వాహనాలు మరియు లైట్ మోటార్ వెహికిల్స్ మూలంగా హెచ్చు సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నందున, ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వాడకం, ఫోర్ వీలర్స్ కు సీట్ బెల్ట్ వినియోగం సెప్టెంబరు 1వ తేదీ నుండి తప్పనిసరి చేస్తున్నట్లు జిల్లా కలక్టర్ డి.మురళీధర్ రెడ్డి తెలిపారు. మంగళవారంనాడు కాకినాడ కలక్టరేట్ లో జరిగిన జిల్లా స్థాయి రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో కలక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ సంవత్సరం జనవరి నుండి జులై వరకు 1345 రోడ్డు ప్రమాదాలు జరిగాయని, వీటి మూలంగా 513 మంది మరణించారని, ఈ రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా ద్విచక్ర వాహనాలు, ఫోర్ వీలర్స్ మూలంగా జరిగినట్లు నివేదికలు తెలియజేస్తున్నాయని అన్నారు. ఈ ప్రమాదాలు నివారణలో భాగంగా హెల్మెట్ వాడకం, సీట్ బెల్ట్ వినియోగం పై సెప్టెంబరు 1వతేదీ నుండి 15వ తేదీ వరకు వాహనదారులకు అవగాహన కల్పిస్తారని, సెప్టెంబరు 15వ తేదీ నుండి నిబంధనలు ఉల్లంఘిస్తే, హెల్మెట్, సీటు బెల్ట్ వాడకపోతే జరిమానా విధిస్తామని అన్నారు. జిల్లాలో ఇటీవల రోడ్డు ప్రమాదాలపై నిర్వహించిన రోడ్డు ఆడిట్ ఆధారంగా జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు మరియు పంచాయతీ రాజ్ అధికారులు అవసరమైన ప్రమాద నివారణ చర్యలను వెంటనే చేపట్టాలని కలక్టర్ సూచించారు. అదేవిధంగా జిల్లాలో గుర్తించిన బ్లాక్ స్పాట్ వద్ద ప్రమాద హెచ్చరికలను వాహనదారులకు కనబడే విధంగా ఏర్పాటు చేయాలని అన్నారు. రహదారులపై వేగ నియంత్రణ కోసం స్పీడ్ గన్స్ ఏర్పాటు చేయాలని, రవాణా శాఖకు కలక్టర్ సూచించారు. రోడ్డు ప్రమాదాలలో గాయపడిన వారికి తక్షణ వైద్యం కోసం 108 సేవలు అందుబాటులో ఉంచాలని, జాతీయ రహదారిలో జగ్గంపేట వద్ద జిజిహెచ్-2 ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నమని అన్నారు. పట్టణ ప్రాంతాల్లో మరియు ఇతర ప్రాంతాలలో రోడ్లపై సంచరిస్తున్న పశువులను ఏజెన్సీ ప్రాంతానికి తరలించి, అక్కడి గిరిజనులకు వాటి సంరక్షణ బాధ్యతను అప్పగించనున్నట్లు కలక్టర్ తెలిపారు.

ఈ సమావేశంలో పాల్గొన్న రవాణా శాఖ డిప్యూటీ కమీషనర్ సిహెచ్.ప్రతాప్ మాట్లాడుతూ జిల్లాలో గత జులై నెలలో జరిగిన 186 రోడ్డు ప్రమాదాల మూలంగా 63 మంది మరణించారని 200 మంది గాయపడ్డారని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ పై రవాణాశాఖ వాహనదారులను రోడ్డు భద్రత వారోత్సవాల నిర్వహణ ద్వారా అవగాహన కల్పిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న రాజమహేంద్రవరం అర్బన్ ఎస్.పి. షీమోషి బాజ్ పాయ్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం సమీపంలోని దివాన్ చెరువు వద్ద వాహన ప్రయాణాలు క్రమబద్దీకరించాలని, అదే విధంగా రోడ్ల పై సంచరించే పశువులను అదుపు చేయాలని సూచించారు. కాకినాడ యస్.పి. అద్నాన్ నయీమ్ అస్మి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ వినియోగం తప్పనిసరిగా చేయాలన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న కాకినాడ ట్రాఫిక్ డి.ఎస్.పి. రామకృష్ణ మాట్లాడుతూ స్మార్ట్ సిటీ రోడ్లపై పశువుల సంచారాన్ని నియంత్రించాలని, చాలా ప్రమాదాలు వీటి మూలంగా జరుగుతున్నాయని అన్నారు. రాజమహేంద్రవరం ఆర్.టి.సి. ఆర్.యం. బ్రహ్మానందరావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ పై ఆర్.టి.సి. డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని, దూర ప్రాంతం డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాల నివారణ పై అవగాహన కల్పిస్తున్నామన్నారు.

ఈ సమావేశంలో జాతీయ రహదారుల ఎస్.ఇ. విజయ్ కుమార్, డి.సి.హెచ్.ఎస్. డా.రమేష్ కిషోర్ పాల్గొన్నారు.

( సమాచార శాఖ చే జారీ)